
ప్రతి అక్షరం ప్రజాహితం
RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com
నేటి ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
సంపుటి - 03 సంచిక -139 పేజీలు - 04 వెల - 04/- శుక్రవారం 26 జూన్ 2026

# నీటిని పొదుపుగా వాడదాం..



## తుంగభద్రానదికి 33 కొత్తగేట్లు



- రూ.51 కోట్లతో 33 కొత్త గేట్ల ఏర్పాటు
- మూడు రాష్ట్రాల సిఎంలు కలసి ప్రారంభం
- కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి పాటిల్
- ఒకేవేదికపై డికె, చంద్రబాబు, రేవంత్

## జల వివాదాలను పరిష్కరించుకుందాం

- పంచాయితీలు కాదు...పరిష్కారాలు ముఖ్యం
- తుంగభద్ర గేట్ల ప్రారంభం చరిత్రలో నిలవాలి
- మూడు రాష్ట్రాల పరిధిలో సమస్యలకు పరిష్కారం చూపాలి
- కేంద్రమంత్రి పాటిల్ దీనిని అవకాశంగా తీసుకోవాలి
- మునీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



**బళ్లారి,జూన్ 25 ఆంధ్ర ప్రగతి**
కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనతో రూ.51 కోట్లతో 33 కొత్త గేట్లను అమర్చారు. ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. మిగతా 2లో...

## నదుల అనుసంధానంతోనే దేశాభివృద్ధి

- మూడు రాష్ట్రాల సీఎంల భేటీ చరిత్రాత్మకం: సీఎం చంద్రబాబు
- నదుల అనుసంధానమే దేశాభివృద్ధికి కీలకమన్న చంద్రబాబు
- ఎల్ నినో ప్రభావంతో నీటిని పొదుపుగా వాడాలని సూచన
- దక్షిణాది రాష్ట్రాల భేటీ చరిత్రలో నిలిచిపోతుందన్న సీఎం



# వెనిజువెలా వణికింది




- 39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూప్రకంపనలు
- నేలమట్టం అయిన భారీ భవనాలు..ఇళ్లు, భవన సముదాయాలు
- దాదాపు శతాబ్దకాలం తరవాత అతిపెద్ద భూకంపంగా నమోదు
- అత్యవసర పరిస్థితి ప్రకటించిన అధ్యక్షురాలు రోడ్రిగేజ్

**కారకాస్,జూన్ 25 ఆంధ్ర ప్రగతి**
వెనిజువెలాలో కేవలం నిమిషం తేడాలో రెండుసార్లు భారీ భూకంపం వణికించింది. బుధవారం స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం ఆరు గంటల సమయంలో వెనిజువెలాలో రెండుసార్లు భూమి కంపించింది. తొలుత రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.2 కాగా, ఆ తర్వాత 7.5 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదు అయ్యాయి. మిగతా 2లో...

## భారత్‌లో అమెజాన్ రూ.4లక్షల కోట్ల పెట్టుబడి

- ప్రధాని మోదీతో అమెజాన్ సీఈఓ భేటీ..
- ముంబై, హైదరాబాద్‌లలో డేటా సెంటర్ల పెంపునకు ప్రణాళిక



**జూన్ 25 ఆంధ్ర ప్రగతి**
ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్, భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీతో కంపెనీ సీఈఓ ఆండీ జెస్సీ సమావేశమైన అనంతరం ఈ కీలక ప్రకటన వెలువడింది. 2026 నుంచి 2030 మధ్య కాలంలో దేశంలో ఏకంగా 48 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 4.53 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు అమెజాన్ ప్రకటించింది. ఈ పెట్టుబడులతో భారత మార్కెట్‌పై తమకున్న దీర్ఘకాలిక . మిగతా 2లో...

## గతాన్ని మరచి పోండి.. అలాంటి పొరపాట్లు జరగవు



- ఇకముందు మిమ్ములను బాగా చూసుకుంటా
- వచ్చేది కెసిఆర్ ప్రభుత్వమే అంటూ..
- కార్యకర్తలకు కెటిఆర్ భరోసా

**వికారాబాద్,జూన్ 25 ఆంధ్ర ప్రగతి**
వచ్చే ఐదేళ్లు మన ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్యకర్తల బాగోగులు, ప్రజల సంక్షేమం రెండింటిని బ్యాలెన్స్‌గా నడిపించే బాధ్యత నాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసానిచ్చారు. 2028లో మీ అందరి దయతో కేసీఆర్ ముఖ్యమంత్రి అయితరు.. అయిన తర్వాత నేను బాధ్యత తీసుకుంటా..అన్నారు. మీకు రావాల్సిన పదవులు.. జరుగాల్సిన లాభం. మిగతా 2లో...

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై నారా లోకేష్ దృష్టి..



- ప్రభుత్వ పాఠశాలలకు లక్షకు పైగా కొత్త అడ్మిషన్లు
- ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై అధ్యయనానికి ఆదేశం
- సెప్టెంబర్ 5 నుంచి ఏఐ ట్యూటర్ విధానం పైలట్ ప్రాజెక్ట్
- అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన

**అమరావతి,, ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు, అభ్యసన ఫలితాలపై ఈ విద్యా సంవత్సరం ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల విద్యశాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మిగతా 2లో...

## స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి

- అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- కార్యకర్తలకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం



**మంత్రాలయం,జూన్ 25 ఆంధ్ర ప్రగతి**
మరో మూడు నెలల్లో జరగనున్న స్థానిక ఎన్నికల్లో తెదేపా ఘన విజయం సాధించాలని ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు శ్రేణులకు పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం మాధవరంలో తెదేపా శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. కర్ణాటకలోని హోసపేటెలో తుంగభద్ర ప్రాజెక్టు మిగతా 2లో...

## కూటమి పాలనలో డ్వాక్రా మహిళలకు అన్యాయం



- డ్వాక్రా సంఘాలకు వడ్డీ రాయితీపై కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్న జగన్
- వడ్డీ రాయితీ కింద ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని మండిపాటు
- 2025-26లో రాష్ట్ర పన్ను ఆదాయ వృద్ధి -3.22 శాతంగా నమోదైందని విమర్శ

**అమరావతి,జూన్ 25 ఆంధ్ర ప్రగతి**
ఏపీలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన కీలక హామీలను చంద్రబాబు సర్కార్ పూర్తిగా విస్మరించిందని, వడ్డీ రాయితీ పథకాన్ని నిలిపివేసి మహిళా సంఘాలను నిర్వీర్యం చేస్తోందంటూ ఎక్స్ వేదికగా ఆయన సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. ఏపీలో పన్ను ఆదాయ వృద్ధి పడిపోయిందనిమిగతా 2లో...



## ఎపిలో క్రియేటివ్ ఎకానమీ విప్లవం

- జూలై నెలలో మెగా ఫిల్మ్ వర్క్‌షాప్
- యువతకు ఆధునిక సినీ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ
- సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

**అమరావతి,జూన్ 25 ఆంధ్ర ప్రగతి** నవ్యాంధ్రలో సరికొత్త 'క్రియేటివ్ ఎకానమీ విప్లవం'కు శ్రీకారం చుట్టనున్నట్లు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. రాష్ట్రంలోని స్థానిక యువత ప్రతిభను ప్రోత్సాహించడంతో పాటు.. యువతకు ఆధునిక సినీ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణమిగతా 2లో...

# నీటిని పొదుపుగా వాడదాం..

(మొదటి పేజి తరువాయి)

తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు. రూ.51కోట్లతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన 33 కొత్త స్పీల్ వే గేట్లను ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, శివకుమార్ కలసి ప్రారంభిండం విశేషం. ఈ కార్యక్రమానికి కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు ఆయా రాష్ట్రాల మంత్రులు, అధికారులు, పార్టీల కార్యకర్తలు హాజరయ్యారు. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం విజయనగర జిల్లా హోసపేటలో జరిగే భారీ బహిరంగ సభకు కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రులు వెళ్లారు. అంతకుముందు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కొప్పల్ జిల్లా మునీరాబాద్‌లోని ఆడిటోరియంలో భేటీ అయ్యారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. తొలుత చంద్రబాబు, డీకే శివకుమార్ భేటీ అవ్వగా.. సమావేశానికి రేవంత్ రెడ్డి 15 నిమిషాలు ఆలస్యంగా వెళ్లారు. అనంతరం ముగ్గురు సీఎంలు, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నీటి సమస్యలపై కీలక చర్చలు జరిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి గేట్ల ప్రారంభోత్సవానికి వెళ్లారు.



## జల వివాదాలను పరిష్కరించుకుందాం

**మునీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి**

తుంగభద్ర నది ఒడ్డున.. బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.'తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం,
పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం. అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి.. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నానని అన్నారు. నీటి సమస్యలు పరిష్కరించకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తున్నాయి. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నాం. దాదాపు 10 టీఎంసీల నీరు మా వరకూ రావట్లేదు. రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో నిలుస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు వలసల గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. మూడు రాష్ట్రాల కరువు జిల్లాలకు ఇది పరిష్కారం చూపబోతోందని పేర్కొన్నారు. గురువారం తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లు ప్రారంభించాక, కర్ణాటక కొప్పల్ జిల్లా మునీరాబాద్ బహిరంగ సభలో సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసు అని చెప్పుకొచ్చారు. మనందరి కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు చంద్రబాబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని తెలిపారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోవడంతో నీరు సముద్రం పాలవుతోందని చెప్పారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని అన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తమకు రావడం లేదని చెప్పారు. ద రైతులకు న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని అన్నారు. చరిత్రలో ఈరోజు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుందని తెలిపారు. తమకు పంచాయితీలు వద్దని.. పరిష్కారం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ, తెలంగాణలోని లక్షలాదిమంది రైతుల సమస్యకు తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పరిష్కారమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నీటి సమస్యను పరిష్కరించక పోవడంతోనే పాలమూరు వాసులు వలసలు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. నీటి సమస్యలు ఓ కొలిక్కి వచ్చాయని.. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించామని తెలిపారు. తుంగభద్రలో పూడికతీతకు సంబంధించిన వ్యవహారంపై కేంద్రమంత్రితో చర్చించామని అన్నారు. తుంగభద్ర నది ఒడ్డున జరిగిన చర్చలు అంతరాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నీటి సమస్యను సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పుకొచ్చారు. ఆయన ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారనే నమ్మకం తమకు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## నదుల అనుసంధానమే దేశాభివృద్ధికి కీలకమన్న చంద్రబాబు

కర్ణాటకలోని హోసపేటలో ఉన్న తుంగభద్ర ప్రాజెక్టుకు 33 నూతన క్రస్ట్ గేట్లను ప్రారంభించడం చారిత్రాత్మక ఘట్టమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఈ కార్యక్రమం అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ చొరవతో ఏపీ, కర్ణాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు ఒకేచోట కలవడం చారిత్రాత్మకమని అన్నారు. కేంద్రమంత్రి తన చొరవతో మూడు రాష్ట్రాల ప్రభుత్వాధినేతలనే కాకుండా, నదులను కూడా అనుసంధానించారని ఆయన వ్యాఖ్యానించారు.
మూడు రాష్ట్రాల రైతులకు సాగునీటిని, ఈ ప్రాంత వాసులకు తాగునీటిని అందిస్తోన్న తుంగభద్ర డ్యామ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని చంద్రబాబు గుర్తుచేశారు. 'తుంగా పానం, గంగా స్నానం' అనే సామెతను ప్రస్తావిస్తూ, తుంగ నది నీటి పవిత్రతను కొనియాడారు. 2024లో 19వ నంబర్ గేటు కొట్టుకుపోయినప్పుడు, నిపుణుడు కన్నయ్య నాయుడు సలహాతో స్టాప్‌లాక్ గేట్ అమర్చి నీటి వృధాను అరికట్టామని తెలిపారు. ఇప్పుడు ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు సమష్టిగా పనిచేసి 33 కొత్త గేట్లను ఏర్పాటు చేసి, డ్యామ్‌ను పునరుద్ధరించి రైతుల ప్రయోజనాలను కాపాడామని వివరించారు.
ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో 'వన్ నేషన్ వన్ గ్రిడ్', టెలికాం, రహదారుల నెట్‌వర్క్ వంటి కార్యక్రమాలతో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని చంద్రబాబు అన్నారు. ఇదే స్ఫూర్తితో దేశంలో గంగా-కావేరి నదుల్ని అనుసంధానిస్తే భారతదేశం అప్రతిహతంగా ముందుకు సాగుతుందని ఆయన ఆకాంక్షించారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో కెన్-బెత్వా ప్రాజెక్టు ద్వారా నదుల అనుసంధానం విజయవంతమైందని గుర్తుచేశారు. అదేవిధంగా గోదావరి-కావేరి నదులను అనుసంధానించడం ద్వారా కర్ణాటక, ఏపీ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల ప్రయోజనాలు నెరవేరతాయని సూచించారు.
ఈ ఏడాది ఎల్ నినో కారణంగా తుంగభద్ర, ఆల్మట్టి జలాశయాలకు ఎగువ నుంచి నీటి ప్రవాహాలు తగ్గిపోయాయని, అందుకే నీటిని చాలా పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు హెచ్చరించారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితులను అధిగమించేందుకే నదుల అనుసంధానం కీలకమని ఆయన పునరుద్ఘాటించారు. ముందుగా రాష్ట్రాల పరిధిలో అంతర్గతంగా నదులను అనుసంధానించుకుని, ఆ తర్వాత అంతర్రాష్ట్ర నదుల అనుసంధానంపై దృష్టి పెట్టాలని సూచించారు. విజయనగర సామ్రాజ్యానికి, హంపీకి తుంగభద్ర నది సహజ రక్షణ కవచంగా నిలిచిందని, జోగులాంబ, హంపీ విరుపాక్ష ఆలయం, రాఘవేంద్ర మఠం వంటి ఎన్నో పుణ్యక్షేత్రాలు ఈ నదీ తీరానే వెలిశాయని చంద్రబాబు గుర్తుచేశారు. 'రాష్ట్రాలుగా మనం వేరైనా, దేశంగా మనం అంతా ఒక్కటే' అని పేర్కొంటూ, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి రైతుల ప్రయోజనాలపై చర్చించడం శుభపరిణామమని అన్నారు. ఈ సమావేశం దక్షిణాది రాష్ట్రాల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని, అందరం కలిసికట్టుగా రైతుల ప్రయోజనాలను కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

# వెనిజువెలా వణికింది

(మొదటి పేజి తరువాయి)

ఆ భూకంపాల ధాటికి భారీ బిల్డింగ్‌లు నేలమట్టం అయ్యాయి. లా గౌరియా ప్రాంతం తీవ్రంగా ప్రభావానినికి గురైంది. అయితే ఆ భూకంపాల వల్ల 32 మంది మృతిచెందగా, 700 మంది గాయపడినట్లు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. డజన్ల సంఖ్యలో బిల్డింగ్‌లు కూలాయని, వీలైనంత వరకు అందర్నీ రక్షిస్తున్నామని, రెస్క్యూ ఆపరేషన్ చేపట్టామని, లా గౌరియా రాష్ట్రంలో పరిస్థితి భయానకంగా ఉందని అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. దేశ రాజధాని కారకాస్‌కు పశ్చిమ దిశలో 168 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరీబియన్ తీరంలోని మోరన్ ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకటించింది. సుమారు 22 కిలోమీటర్ల లోతులో భూమి కంపించినట్లు పేర్కొన్నారు. దాదాపు శతాబ్ద కాలం తర్వాత వెనిజువెలాలో భారీ భూకంపం సంభవించింది.
మృతుల సంఖ్య లక్ష వరకు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే పేర్కొన్నది. వెనెజువెలాను బుధవారం నాడు వరుస భూకంపాలు 39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూకంపాలు సంభవించి తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. కరేబియన్ తీరంలోని మోరోన్ పట్టణానికి పశ్చిమాన 21 కిలోమీటర్ల దూరంలో 7.2 తీవ్రతతో మొదటి భూకంపం వచ్చింది. అదే పట్టణానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో క్షణాల వ్యవధిలోనే 7.5 తీవ్రతతో మరో భూకంపం సంభవించింది. ఈ ఘటనలో 10 వేల నుంచి లక్ష మంది వరకూ ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే అంచనా వేసింది. అలాగే వేల మంది ప్రజలు గాయపడి ఉండొచ్చని తెలిపింది. భూకంపాలతో అనేక భవనాలు నేలమట్టం కాగా, ప్రజలు భయంతో పరుగులు తీస్తున్న అనేక వీడియోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. మొదటి భూకంపం వచ్చినప్పుడు ఒక్కసారిగా పెద్దపెద్ద భవనాలు కూలిపోవడం ప్రారంభమయ్యాయి. అనేక చిన్నచిన్న ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఏం జరుగుతుందో గ్రహించి, ప్రాణరక్షణ కోసం ప్రజలు పరిగెత్తే లోపే అంతకంటే ఎక్కువ తీవ్రతతో రెండో భూకంపం వచ్చింది. దీంతో భారీ విధ్వంసం జరిగింది. కొన్ని భారీ భవనాలు కూలిపోగా, మరికొన్ని బిల్డింగులు ఊగిపోయాయి. కొన్ని ఇళ్ల పైకప్పులు కూలిపోగా, శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారు. దీంతో తమ ప్రాణాలను, కుటుంబ సభ్యులను కాపాడు కునేందుకు స్థానికులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. మరోవైపు వెనెజువెలాలోని సైమన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయం పైకప్పు కూలిపోయింది. దీంతో విమానాశ్రయంలోని టెర్మినల్ మొత్తం దుమ్ముతో నిండిపోయింది. కొంతమంది ప్రయాణికులు తమ లగేజీ పట్టుకుని ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. మరికొంతమంది లోపలే ఓ ఫుడ్ కౌంటర్ వద్ద ఆశ్రయం పొందారు. మొత్తం దుమ్ముతో నిండిపోతున్నా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అక్కడే ఉండిపోయారు. తీరప్రాంత నగరమైన లా గువైరాకు సంబంధించిన మరో వీడియో వెలుగులోకి వచ్చింది. వరుస భూకంపాలతో కూలిపోయిన భవనాలు, గాలిలోని దుమ్ము, నిర్మానుష్యంగా మారిన రహదారులు ఆ వీడియోలో కనిపించాయి. వెనెజువెలా రాజధాని కారకాస్‌లోనూ భారీ విధ్వంసం జరిగింది. అనేక భవనాలు నేలమట్టం అయ్యాయి. స్థానికులు ప్రాణభయంతో కేకలు వేసిన దృశ్యాలు ఆవేదన కలిగిస్తున్నాయి. మరో వీడియోలో ఓ వ్యక్తి తన పెంపుడు కుక్కల ప్రాణాలు కాపాడిన దృశ్యాలు కనిపించాయి. కూలిపోయిన తమ ఇంటి నుంచి అతి కష్టం మీద కుటుంబ సభ్యులను కాపాడుకున్నాడు బాధితుడు. ఆ తర్వాత తన రెండు కుక్కలనూ ప్రాణాలతో బయటకు తీసుకువచ్చాడు. ఇలాంటి అనేక వీడియోలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను కంటతడి పెట్టిస్తున్నాయి. మరోవైపు జంట భూకంపాల అనంతరం వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. బాధితులను ఆదుకునేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడో కూడా ప్రజలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ఎపిలో క్రియేటివ్ ఎకానమీ విప్లవం

(మొదటి పేజి తరువాయి)

రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జూలై నెలలో మెగా ఫిల్మ్ వర్క్‌షాప్
నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. గురువారం సచివాలయంలో మంత్రిని జాడెక్స్ ఇన్నోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు కలిసి పలు అంశాలపై చర్చించారు. సినీ పరిశ్రమకు సంబంధించిన 24 క్రాఫ్ట్స్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఏఐ ఆధారిత ఫిల్మ్ మేకింగ్ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 24 క్రాఫ్ట్స్ శిక్షణకు సంబంధించి జాడెక్స్ సంస్థ రూపొందించిన యాక్షన్ ప్లాన్‌పై సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి ఫిల్మ్ మేకింగ్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. సినీ, మీడియా రంగాల్లో కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించనున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

## గతాన్ని మరచి పోండి..అలాంటి పొరపాట్లు జరగవు

(మొదటి పేజి తరువాయి)

మీకు కోరుకునే గౌరవం వచ్చే విధంగా చేసే బాధ్యత నాది. గతం మరిచిపోండి.. చిన్నచిన్నపొరపాట్లు జరిగి ఉండొచ్చు. ఇక్కడ ఉద్యమంలో పనిచేసిన బిడ్డలు కూడా ఉన్నారు. వాళ్లకు కూడా అయ్యో మాకు జరుగాల్సిన న్యాయం జరుగలేదనే భావన ఉండొచ్చు. నేను వారందని ప్రార్థిస్తున్నానని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణా కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో లాగా చిన్నచిన్న పొరపాట్లు జరుగకుండా చూసుకుంటమని నేను మీకు మాటిస్తున్నానన్నారు. వాస్తవానికి మొత్తం ప్రభుత్వం మీద దృష్టి పెట్టినం.. పార్టీ మీద ఎక్కువ దృష్టి పెట్టలేదు. కొత్త రాష్ట్రం, కొత్త సంసారం కాబట్టి పునాది గట్టిగా పడాలి అని.. మన రాష్ట్రం నవ్వే వాళ్ళ ముందు జారిపడొద్దని.. మీకు పరిపాలన చేతనైతదా అన్నోళ్లను నోళ్లు మూయించాలే.. మంచిగా నడిపించాలని ఆలోచన చేసాం తప్ప వేరే ఆలోచన చేయలేదని అన్నారు. ఒక సైనికుడు శాంతి సమయంలో ఎంత చెమట చిందిస్తే, యుద్ధంలో అంత తక్కువ రక్తం కారుతుంది. మీ ఈ టైంలో పార్టీని బందబస్తుగా నిర్మాణం చేసుకుంటే రేపు ఎన్నికలు వచ్చినంక ఆగమాగమయ్యే బాధ తప్పుతది.. మీకు ఐడీ కార్డు వస్తది.. ఆ ఐడీ కార్డు రేపు మన ప్రభుత్వం వచ్చినంక జేబులో పెట్టుకొని పోతే ఆ ఆఫీసర్ అయినా పోలీసోడు అయినా కేసీఆర్ మనిషి వచ్చిండు పని చేయాలని మీకు గౌరవమిచ్చి పనిచేసే పరిస్థితి ఉంటది. మంచి ఐడీ కార్డు తయారుచేసి ప్రతీ కార్యకర్తకు ఇస్తం. మిమ్మల్ని రాబోయే 5 సంవత్సరాలు మాత్రం గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ జరుగకుండా ఉద్యమ కారులను కానీ, కార్యకర్తలను కానీ కడుపులో పెట్టుకొని చూసుకునే బాధ్యత తీసుకుంటానన్నారు.

# కూటమి పాలనలో డ్వాక్రా మహిళలకు అన్యాయం

(మొదటి పేజి తరువాయి)

రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు వెళ్తోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం డ్వాక్రా సంఘాల రుణాలపై వడ్డీ రాయితీ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని సూపర్ సిక్స్ తరహాలో హామీ ఇచ్చిందని జగన్ అన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ మాట తప్పారని మండిపడ్డారు. తమ వైసీపీ ప్రభుత్వ హయాంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.4,969 కోట్ల మేర వడ్డీ రాయితీతో పాటు ఆసరా, చేయూత వంటి స్కీమ్స్‌తో ఆర్థిక భరోసా ఇచ్చామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25 ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రాయితీ కింద ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని జగన్ ఆరోపించారు. 2025-26 బడ్జెట్‌లో రూ.100 కోట్లు, మళ్లీ ఇప్పుడు 2026-27 బడ్జెట్‌లోనూ రూ.100 కోట్లు కేటాయించినప్పటికీ.. ఆ నిధులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, గ్రౌండ్ లెవెల్లో ఒక్క పైసా కూడా విడుదల కాలేదన్నారు. ఈ వడ్డీ రాయితీ అమలు చేయకపోవడం వల్ల గత రెండేళ్లలో డ్వాక్రా మహిళలకు సుమారు రూ.6 వేల కోట్ల మేర నష్టం జరిగిందని విమర్శించారు. 2023-24లో రూ.49,696 కోట్లుగా ఉన్న డ్వాక్రా రుణ వృద్ధి.. కూటమి పాలనలో 2024-25 నాటికి రూ.41,623 కోట్లకు, 2025-26లో మరింత తగ్గి రూ.41,105 కోట్లకు పడిపోయిందని అన్నారు. అంతేకాదు, 2025-26లో రాష్ట్ర పన్ను ఆదాయ వృద్ధి -3.22 శాతంగా నమోదైందని... ఇది ఏపీలో స్పష్టమైన ఆర్థిక మాంద్యానికి సంకేతమని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న మహిళా సంఘాలను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రం మరింత సంక్షోభంలో పడుతుందని హెచ్చరిస్తూ, బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## భారత్‌లో అమెజాన్ రూ.4లక్షల కోట్ల పెట్టుబడి

(మొదటి పేజి తరువాయి)

నిబద్ధతను కంపెనీ మరోసారి స్పష్టం చేసింది.
భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను విస్తరించడానికి 2030 నాటికి అదనంగా 13 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఆండీ జెస్సీ తెలిపారు. దీంతో కేవలం ఏఐ, క్లౌడ్ రంగంలోనే అమెజాన్ మొత్తం పెట్టుబడి 21 బిలియన్ డాలర్లను దాటనుంది. ఈ పెట్టుబడుల ద్వారా ముంబై, హైదరాబాద్‌లలోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) డేటా సెంటర్ల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నారు. ఇది స్టార్టప్‌లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలకు కస్టమ్ ఏఐ చిప్స్, సురక్షిత క్లౌడ్ టెక్నాలజీలు, డెవలపర్ టూల్స్‌ను అందుబాటులోకి తెస్తుంది. తద్వారా ఆవిష్కరణలను వేగవంతం చేయవచ్చని కంపెనీ పేర్కొంది. ఈ సమావేశం అనంతరం ఆండీ జెస్సీ మాట్లాడుతూ.. "దశాబ్దం క్రితం భారత్‌లోకి అడుగుపెట్టాం. అప్పటి నుంచి ఈ-కామర్స్, ఏఐ, క్లౌడ్ వ్యాపారాల్లో అద్భుతమైన వృద్ధిని చూస్తున్నాం. ప్రధాని మోదీ దార్శనికత అయిన 'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాల సాధనకు కట్టుబడి ఉన్నాం. భారత్ వృద్ధి ప్రస్థానంలో దీర్ఘకాలిక భాగస్వామిగా కొనసాగుతాం" అని స్పష్టం చేశారు. ఈ కొత్త పెట్టుబడులతో కలిపి 2010 నుంచి 2030 వరకు భారత్‌లో అమెజాన్ పెట్టిన మొత్తం పెట్టుబడుల విలువ 88 బిలియన్ డాలర్లకు పైగా చేరుకుంటుంది.
గత కొన్నేళ్లుగా భారత్‌లో 12 మిలియన్ల చిన్న వ్యాపారాలను డిజిటలైజ్ చేశామని, 20 బిలియన్ డాలర్ల విలువైన ఈ-కామర్స్ ఎగుమతులను సాధ్యం చేశామని, ప్రత్యక్షంగా, పరోక్షంగా 2.8 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇచ్చామని కంపెనీ వివరించింది. అలాగే, 10 మిలియన్ల భారతీయులకు క్లౌడ్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపింది. భవిష్యత్తులోనూ భారత ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఏఐ ఆధారిత డిజిటలైజేషన్, ఎగుమతుల వృద్ధి, ఉద్యోగాల కల్పనపై దృష్టి సారిస్తామని అమెజాన్ పేర్కొంది. రానున్న కాలంలో 3.8 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇవ్వడం, 80 బిలియన్ డాలర్ల సంచిత ఎగుమతులు సాధించడం, 15 మిలియన్ల చిన్న వ్యాపారాలకు ఏఐ ప్రయోజనాలు అందించడం, 4 మిలియన్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ విద్యను అందించడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు వెల్లడించింది.
,

## స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి

(మొదటి పేజి తరువాయి)

కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన అనంతరం సీఎం మాధవరం చేరుకున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రాలయం తెదేపా ఇన్‌ఛార్జ్ రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మన ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలి. తెదేపా నాయకులు నిరంతరం ప్రజల్లో ఉండాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన వారిని అక్కున చేర్చుకుంటా. ఓడిపోయిన వారిని పక్కన పెట్టేస్తా. కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి. మంత్రాలయం వైకాపా ఎమ్మెల్యే చిచ్చు పెడుతున్నారు.. ఆయనకు బుద్ధి చెబుతాం. 2029 ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. అధికారం ఉంది కదా అని నేతలు ప్రజలకు అందుబాటులో లేకపోతే వారికి దూరమవుతారు. మంత్రాలయం తెదేపాలో అసమ్మతి, విభేదాలు లేకుండా అందరూ ఒక్కతాటిపైకి వచ్చి గెలుపుకోసం పని చేయాలని చంద్రబాబు సూచించారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై నారా లోకేష్ దృష్టి..

(మొదటి పేజి తరువాయి)

ఈ సందర్భంగా శాఖకు సంబంధించిన పలు కీలక వివరాలను అధికారులు మంత్రికి వివరించారు.
ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు సుమారు 1,06,000 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని మొత్తం 7,620 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3,515 పాఠశాలలు (46.13 శాతం) ప్రస్తుతం పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నాయని వారు వివరించారు. విద్యా రంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల వల్లే ఈ సానుకూల మార్పు చోటుచేసుకుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణ అంశంపై కూడా ప్రధానంగా చర్చించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించి ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, నివేదిక సమర్పించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. మరోవైపు, సెప్టెంబర్ 5 నుంచి మొదటి విడత కింద 175 'లీప్' పాఠశాలల్లో 9, 10 తరగతుల విద్యార్థుల కోసం 'ఏఐ ట్యూటర్' విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఈ విధానాన్ని 'క్లిక్కర్స్'కు అనుసంధానించాలని మంత్రి అధికారులకు సూచించారు. అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, విశాఖపట్నంలో డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీ, మంగళగిరిలో స్కిల్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. వచ్చే నెలలో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

శుక్రవారం 26 జూన్ 2026

# అశోక్ లేలాండ్ షోరూంను ప్రారంభించిన

# మంత్రి టీజీ మాజీ ఎమ్మెల్సీ షరీఫ్.





**ఆంధ్ర ప్రగతి కర్నూలు జూన్ 24:**
కర్నూలు జిల్లా కేంద్రంలోని డోన్ బైపాస్ రోడ్ లో కొత్తగా ఏర్పాటు చేసిన అశోక్ లేలాండ్ షోరూంలో మంత్రి టీజీ భరత్,,షరీఫ్ ప్రారంభించారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ చైర్మన్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షరీఫ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం పరిశ్రమ ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న చర్యలతో ఇతర ప్రాంతాల నుంచి ఆంధ్రప్రదేశ్కు లక్షల కోట్ల కోట్ల పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. కచ్చితంగా యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి అవకాశం ఏర్పడిందన్నారు. వాహీద్ హుస్సేన్ రాష్ట్రమంత్రి, టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ కు అత్యంత సన్నిహితుడు ప్రీతిపాతుడు అని షరీఫ్ గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వాహిద్ హుస్సేన్ తీసుకున్న నిర్ణయం సరైన ఇప్పటికే వ్యాపారవేత్తగా, ప్రజాసేవలను ముందున్న వాహీద్ హుస్సేన్ అశోక్ లేలాండ్ షోరూంలో ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలకు పెంచడానికి తీసుకున్న చర్య అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి తాను చదువుకున్న రోజుల్లో చెన్నైలోని అశోక్ లేలాండ్ ప్రైస్ వాటర్ కూపర్ తరపున విధులు నిర్వహించి అశోక్ లేలాండ్ కంపెనీకి తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. దేశంలోనే ఎంతో విలువైన బ్రాండ్ ను కలిగి ఉన్న అశోక్ లేలాండ్ షోరూంలో కర్నూల్కు తీసుకురావడం చాలా అభినందనీయమన్నారు.. కర్నూలు జిల్లా కేంద్రంలో అశోక్ లేలాండ్ షోరూం , సర్వీస్ సెంటర్ ను ఏర్పాటు చేయడం ద్వారా అటు నిరుద్యోగ యువతకు ఎటు అశోక్ లేలాండ్ యజమానులకు వాహనాలకు మెరుగైన సేవలు అందిస్తారు అన్న ఆశ భవాని మంత్రి పీజీ వ్యక్తం చేశారు. తన వంతు సహకారం అందిస్తామని మంత్రి టీజీ స్పష్టం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్, షరీఫ్ ను ఘనంగా సన్మానించి8, మూమెంట్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మార్క్ ఫ్రెండ్ డైరెక్టర్ తులసిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పారిశ్రామికవేత్త సుదర్శన్ రెడ్డి, మైనార్టీ నాయకులు అక్తర్హు స్సేన్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన

# మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలి.

..విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు.

..రూ.6,450 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయలేని ప్రభుత్వం అధికారంలో కొనసాగే నైతిక హక్కు కోల్పోయింది.

పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎం.డి. రఫీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 25:**
రాష్ట్ర విద్యారంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టి, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని పి.డి.ఎస్.యు రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు.
నేడు నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్ ఆర్చ్ వద్ద నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో విద్యార్థులు, యువతకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిలో ఒక్కదానినైనా పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. విద్యారంగ సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.
రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులకు సంబంధించిన రూ.6,450 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు కళాశాలల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు పరోక్షంగా సహకరిస్తోందని ఆరోపించారు. సంక్షేమ హాస్టళ్లలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. యువగళం పాదయాత్రలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో మంత్రి నారా లోకేష్ పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి, ఖాళీగా ఉన్న సుమారు 2.50 లక్షల ఉద్యోగాల భర్తీ, ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీ పోస్టుల నియామకాలు వంటి కీలక అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించలేకపోయిందన్నారు. ఇది యువతపై చేసిన ఘోర మోసమని తెలిపారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైనందుకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, కోశాధికారి సోమశేఖర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎం.ధనరాజు, భాను ప్రసాద్ ,మావో,షాహీద్,వేణు,దినేష్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రేటర్ రాయలసీమ బహుజన ఉద్యోగుల

# న్యాయభేరి సభ పోస్టర్లు విడుదల.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 25:**
నంద్యాల జిల్లా కేంద్రంలో మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే గారి విగ్రహం దగ్గర జులై 19న చలో నంద్యాల గ్రేటర్ రాయలసీమ బహుజన ఉద్యోగుల న్యాయభేరి సభబ పోస్టర్లు ఆర్ పి ఎస్ ఆర్ ఈ ఎఫ్ ఐఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగింది.
ఈ సందర్భంగా ఆర్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు శేష పని, ఆర్ పి ఎస్ రాష్ట్ర యూత్ అధ్యక్షులు పెరుగు శివకృష్ణ మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం రాజ్యాధికారంలో సమాన వాటా కోసం ఆర్థిక సమానత్వం కోసం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు రచించిన రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలు ఈరోజు వరకు కూడా అమలు కావడం లేదు. దేశంలో 85% ఉన్న బహుజన నేటికి కూడా అన్యాయానికి గురవుతున్నారు. జనాభా దామాషా ప్రకారం రాజకీయ విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించాలనీ వారు మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ, న్యాయ వ్యవస్థలో రిజర్వేషన్లు అమలు, ప్రభుత్వ ఉద్యోగ చట్టం అమలు చేయాలి, గ్రేటర్ రాయలసీమలో గిరిజనులకు ఐదు ఎమ్మెల్యే లు రెండు ఎంపీ స్థానాలు కేటాయింపు, చట్టసభలలో బీసీలకు 44 శాతం రిజర్వేషన్ అమలు కోసం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ భద్రత, విద్యా వైద్య రంగాలలో సమాన అవకాశాలు, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ నిధుల కోసం బహుజనులకు అన్ని రంగాలలో జనాభా దామాషా ప్రకారం వాటా కోసం అన్ని వర్గాల బహుజన ఉద్యోగులు మరియు ప్రొఫెషనల్ అధిక సంఖ్యలో పాల్గొనాలని, గ్రేటర్ రాయలసీమ పరిధిలోని పరిశ్రమలలో స్థానికంగా ఉన్న బహుజన వర్గాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బోయ వాల్మీకి ప్రజా పోరాట సమితి వ్యవస్థాపకులు బోయ పులికొండన్న, ఆర్ ఇ ఎఫ్ కర్నూలు జిల్లా అధ్యక్షులు రమేష్ యాదవ్, ఆర్ పి ఎస్ నంద్యాల యువజన సంఘం అధ్యక్షులు బిజినవేముల శ్రీనివాసులు, ఆర్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాల సురేష్ యాదవ్, ఆర్ పి ఎస్ రాష్ట్ర నాయకులు దేవా శంకర్, జాల రామ్మోహన్ జాల రామ్మూర్తి బోగిన వెంకటేశ్వర్లు శక్తిమాన్ మధు మనోహర్ ఆర్ పి ఎస్ రాష్ట్ర నాయకులు కాటమరాజు పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు చింతల మోహన్ రావు చింతల రాజన్న తుడిచర్ల రవి ఈ కార్యక్రమంలో కర్నూలు నంద్యాల జిల్లాల ఆర్పీఎస్ మరియు ఆర్ ఇ ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన.

.. కర్నూలు, నంద్యాల జిల్లా ఎస్పీలు.ద - భద్రతా చర్యలపై కర్నూలు ఎస్పీకి వివరించిన నంద్యాల జిల్లా ఎస్పీ.

సీఎం పర్యటన భద్రతా ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలన.





**ఆంధ్ర ప్రగతి కర్నూలు జిల్లా క్రైమ్ జూన్ 25:**రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గురువారం మంత్రాలయం మండలం, మాధవరం గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో చేపట్టిన భద్రతా మరియు ఇతర ఏర్పాట్లను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్, నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ లు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, రూట్ బందోబస్తు, సెక్టార్‌ల వారీగా నియమించిన ఇన్‌ఛార్జ్ అధికారుల విధులు, భద్రతా చర్యలపై నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ కి సమగ్రంగా వివరించారు.
బందోబస్తు విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని, సమన్వయంతో విధులు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ పోలీసు అధికారులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీ హుస్సేన్ పీరా, నంద్యాల స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, కర్నూలు డీఎస్పీ శ్రీ రాఘవేంద్ర, సీఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# 74 ఏళ్లుగా పేదల ప్రజా పక్షాన నిలచిన విశాలాంధ్ర.

-సిపిఐ కార్యాలయంలో ఘనంగా 75వ విజయోత్సవ వేడుకలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 25:**విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రిక 74 సంవత్సరాల నుండి పేదల ప్రజాపక్షాన నిలిచి ప్రస్తుతం 75వ వసంతంలోకి అడుగుపెట్టిన శుభసందర్భాన్ని నంద్యాల సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయం నందు విజయోత్సవ వేడుకలు విశాలాంధ్ర నంద్యాల జిల్లా బ్యూరో యన్నం నాగరాజు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మలు హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాటి నుండి నేటి వరకు విశాలాంధ్ర పత్రిక కార్మికులు, కర్షకులు, పీడిత ప్రజల పక్షాన నిలబడి రాజీలేని పోరాటాలు చేసిందన్నారు. ముఖ్యంగా విలువలతో కూడిన జర్నలిజానికి మారుపేరుగా నిలిచిన ఘనత "విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికదే"నన్నారు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలగా ఉన్నప్పుడు జిల్లా అభివృద్ధి, సాగునీటి, త్రాగునీటి సమస్యలపై అలాగే ప్రాజెక్టుల కోసం పేద ప్రజా సమస్యల కోసం నిరంతరం కథనాలు రాస్తూ ప్రజల నిజమైన గొంతుకగా నిలిచి తలలో నాలుకగా నిలిచిందని ప్రశంసించారు. 75వ వసంతంలోకి అడుగుపెట్టిన పత్రిక మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పత్రికా సిబ్బంది, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు రవి, గోకారి పాల్గొన్నారు.

# కేత్ బచావో అభియాన్ కార్యక్రమం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జూన్ 25:** గురువారం నాడు వ్యవసాయ కళాశాల మహానంది అసోసియేట్ డీన్ డా.సి.హెచ్ శ్యామ్ రాజ్ నాయక్ ఆధ్వర్యంలో నంద్యాల మండలం ఉడుమాల్ పురం గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష ప్రాముఖ్యత మరియు వాటి ఫలితాల ఆధారంగా ఎరువులను వేయడం, జీవన ఎరువులను వినియోగించడం, వ్యవసాయ సేంద్రీయ పదార్థాలను సమీకృతంగా వాడటం పై అవగాహన కల్పించారు. అదేవిధంగా, నేల సారవంత పెంపుదల, నేల కాలుష్యాన్ని అరికట్టడానికి అభిలంబించవలసిన వివిధ పద్ధతులను రైతులకు తెలపడం జరిగినది. ఇలా పైన చెప్పిన విధానాలను అభిలంబించడం ద్వారా రైతులు ఎరువుల వినియోగాన్ని తగ్గించి, నేలను ఆరోగ్యవంతంగా, సారవంతంగా ఉంచుకోవడమే కాక వాతావరణ కాలుష్యం ను తగ్గించ వంచని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా. ఎం. జోత్స్న కిరణమై, అసిస్టెంట్ ప్రొఫెసర్ (సస్య విజ్ఞానం) డా. ఎం.విష్ణు ప్రియ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ( సస్య విజ్ఞానం), వి. ఎ ఎ సంజీవ్ మరియు వ్యవసాయ కళాశాల విద్యార్థిని విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

## జనసేన నంద్యాల పార్లమెంట్ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీలో

# సురేష్ చౌదరికి కీలక బాధ్యతలు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 25:**
జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వం మరియు అశీసులతో నంద్యాల పార్లమెంట్ పరిధిలో ఏర్పాటు చేసిన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీలో నంద్యాల నియోజకవర్గం నాయకులు దొడ్ల సురేష్ చౌదరి కి సభ్యునిగా అవకాశం లభించింది. పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయి కార్యకలాపాల సమన్వయం, ప్రజా సమస్యల సేకరణ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కమిటీ ఏర్పాటు చేయబడింది. ఈ కమిటీలో చోటు దక్కడం సురేష్ చౌదరి పార్టీ పట్ల చూపిన అంకితభావానికి, నిరంతర సేవలకు గుర్తింపుగా భావిస్తున్నారు. ఈ సందర్భంగా సురేష్ చౌదరి మాట్లాడుతూ,"తన పై విశ్వాసం ఉంచి తనకు బాధ్యత అప్పగించిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి, పార్టీ రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారానికి, నంద్యాల పార్లమెంట్ పరిధిలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు.
పార్టీ నాయకులు, కార్యకర్తలు సురేష్ చౌదరి కి అభినందనలు తెలియజేస్తూ, ఆయన ఈ బాధ్యతను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

# ఆదాయ పెంపులో నిర్ణీత లక్ష్యాలను అధిగమించాలి.

**..జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్, 24:**
జిల్లాలో ఆదాయ పెంపులో నిర్ణీత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని అధిగమించడానికి కృషి చేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, రిజిస్ట్రేషన్, రవాణా తదితర విభాగాల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డిఆర్ఓ రామునాయక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ....జిల్లాలో ఆదాయ పెంపుకు ప్రతి శాఖ అధికారులు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని అందుకు తగిన విధంగా రాణించాలన్నారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించి గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం రూ. 190.95 కోట్ల రూపాయలతో 7 శాతం వృద్ధి సాధించడం జరిగిందన్నారు. వాణిజ్య పన్నులకు సంబంధించి వార్షిక లక్ష్యం రూ. 440 కోట్ల లక్ష్యం నిర్దేశించగా అందులో ఇప్పటి వరకూ రూ. 177 కోట్ల మేరకు ఆర్జించడం జరిగిందన్నారు. రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఏప్రిల్ మాసం నుండి జూన్ మాసం వరకు రూ. 57.15 కోట్ల మేర నిర్దేశించగా ఇప్పటి వరకూ రూ. 51.88 మేర లక్ష్యాన్ని సాధించడం జరిగిందని అందులో మెరుగైన పురోగతి సాధించాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. మైనింగ్ శాఖకు సంబంధించి ప్రస్తుత ఏడాదికి మేజర్/మైనర్ మినరల్స్ కు సంబంధించి రూ. 193 కోట్లు, మైనర్ మినరల్స్ సంబంధించి రూ. 86 కోట్లు మొత్తంగా రూ. 279 కోట్ల రూపాయలు నిర్దేశించగా ఇప్పటి వరకూ రూ. 50.75 కోట్ల మేర ఆదాయాన్ని సాధించడం జరిగిందన్నారు. లీగల్ మెట్రాలజీ శాఖకు సంబంధించి వారికి కేటాయించిన లక్ష్యాలను సాధించడం జరిగిందన్నారు. జిల్లా అభివృద్ధికి అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేసి జిల్లా ఆర్థికంగా అభివృద్ధి చేయాలని చర్యలు చేపట్టాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

# విద్య దోపిడీపై పోరాటాలకు సన్నద్ధం.

**నీట్ పరీక్ష రద్దుతో ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలి.**

**ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయకపోతే కలెక్టరేట్ల వద్ద నిరసన.-ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్.నాయక్.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 25:**
జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు, సీబీఎస్సీ విద్యా సంస్థల దోపిడీపై భవిష్యత్తు పోరాటాలకు సన్నద్ధమవుతున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్.నాయక్ జిల్లా కమిటీ సమావేశంలో పోరాటాలకు ప్రణాళికను సిద్ధం చేశారు . నీట్, సి యు సి సెట్ వంటి పరీక్షల ప్రశ్నాపత్రాలను లీక్ చేయడం, పరీక్షలను రద్దు చేయడం దారుణమన్నారు. 23 లక్షల మంది నీట్ పరీక్ష రాశారని, పరీక్ష రద్దుతో వారంతా తల్లడిల్లుపోయారని తెలిపారు. 18 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, వారి కుటుంబాలకు రూ. కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.
రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేష్ తన శాఖను వదిలేసి సకల శాఖల మంత్రిగా వ్యవహరిస్తున్నారని రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు గడుస్తున్నా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రాష్ట్రంలో రూ. 7 వేల కోట్లు ఫీజురీయింబర్స్మెంట్ బకాయిలు ఉన్నాయని తెలిపారు. వీటిని వెంటనే విడుదల చేయని పక్షంలో కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు




చేపట్టి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**జిఓ నెంబర్ 77ను రద్దు చేయకపోవడంతో పీజీ చదువుకు దూరం.**
యువగళం పాదయాత్రలో లోకేష్ అధికారం చేపట్టిన వంద రోజుల్లో జిఓ నెంబర్ 77ను రద్దు చేస్తామని చెప్పారని ఎం.ఆర్.నాయక్ గుర్తు చేశారు. రెండేళ్లయినా హామీ అమలు కాలేదన్నారు. లక్షా 18 వేల మంది విద్యార్థులు పీజీ చదివే వాళ్లని, జిఓ 77 రద్దు చేయకపోవడం వల్ల కేవలం 16 వేల మంది మాత్రమే పిజి చదువుతున్న పరిస్థితి ఉందని తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యి రోజులు గడుస్తున్నా పుస్తకాలతో పాటు విద్య సామగ్రిని అందించకపోవడం దారుణమన్నారు. దీనికి యుద్ధాన్ని కుంటి సాకుగా చూపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రైవేటు,కార్పొరేట్, సీబీఎస్సీ పాఠశాలల్లో మాత్రం విద్య సామగ్రి పేరుతో విద్య వ్యాపారం జరుగుతోందని విమర్శించారు.తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థ ల్లో ఫీజ్ స్ట్రక్చర్ బోర్డులను ఏర్పాటు చేశారని తెలిపారు. దీనిని అమలు చేయాలని మంత్రి నారా లోకేష్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎక్కడా అమలు కావట్లేదని, జిల్లా విద్యా శాఖ పనిచేస్తుందో? లేదో కూడా తెలియని పరిస్థితిలో ఉందన్నారు. అకాడమీల పేరుతో ఎటువంటి అనుమతులూ లేకుండా ఇంటర్ కళాశాలలను పెద్ద ఎత్తున నడుపుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా నాయుకులు శివకుమార్, రాజా, దినేష్, సాయికుమార్, విజయ్, సాయి మరియు తదితరులు పాల్గొన్నారు.

# భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ ఒక 'చీకటి రోజు'

**--రాజ్యాంగంపై జరిగిన ప్రత్యక్ష దాడే ఎమర్జెన్సీ.**

**- నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 25:**
1975లో దేశంలో విధించిన జాతీయ అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) భారత రాజ్యాంగంపై జరిగిన ప్రత్యక్ష దాడేనని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దేశాన్ని నియంతృత్వంలోకి నెట్టేసి, ప్రజాస్వామ్య విలువలపై దాడి చేసిందని మండిపడ్డారు.



**పౌర స్వేచ్ఛను పూర్తిగా నిలిపివేశారు..**
ఎమర్జెన్సీ కాలంలో పౌరులకు రాజ్యాంగం కల్పించిన కనీస హక్కులను, పౌర స్వేచ్ఛను పూర్తిగా నిలిపివేశారని అభిరుచి మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పత్రికలపై ఆంక్షలు విధించి, భావప్రకటనా స్వేచ్ఛను పూర్తిగా అణచివేశారని దుయ్యబట్టారు. పాలకుల తప్పులను ప్రశ్నించే గొంతులను నొక్కిన నల్లటి రోజులను దేశ ప్రజలు ఎప్పటికీ మరువరని స్పష్టం చేశారు.

**ప్రజాస్వామ్య పునాదులపై దాడి..**
భారత ప్రజాస్వామ్యానికి పునాదులైన అత్యున్నత స్వతంత్ర సంస్థలపై నాటి ప్రభుత్వం ప్రత్యక్ష దాడికి తెగబడిందని మధు ఆరోపించారు.


**రాజ్యాంగ పరిరక్షణకు అప్రమత్తంగా ఉండాలి..**
దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేడు ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చీకటి రోజులు పునరావృతం కాకుండా ఉండాలంటే, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి పౌరుడూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా అభిరుచి మధు పిలుపునిచ్చారు.

# గ్రామపంచాయతీ పబ్లిక్ బోర్ కబ్జా.!

**..అనుమతులు లేకుండా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం.**

**..చోద్యం చూస్తున్న యర్రగుంట్ల గ్రామపంచాయతీ అధికారులు. ..ఎంపీడీఓకు గ్రామస్తుల ఫిర్యాదు.**

**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల జూన్ 25:** ప్రభుత్వ గ్రామపంచాయతీ మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖ సంయుక్తంగా లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ బోరును కొందరు స్వార్థపరులు యదేక్షగా కబ్జా చేశారు. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా కమర్షియల్ భవనం 90% పూర్తి చేసిన గృహ యజమానులే ప్రభుత్వ పంచాయతీ బోరును కబ్జా చేయడం విశేషం. ప్రత్యామ్నాయంగా ఎటువంటి నీటి వసతి సౌకర్యం లేని చోట ప్రయాణికులకు స్థానికులకు ఎంతోమందికి నీటిని అందించిన బోరు కబ్జాకు గురికావడం పట్ల యర్రగుంట్ల గ్రామంలోని బస్టాపు వద్ద గల వ్యాపారులు ప్రయాణికులు నివాస కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క రెండు లక్షలకు పైగా విలువ చేసే బోరును కబ్జా చేసినప్పటికీ మరోపక్క ఏమాత్రం పంచాయతీ అనుమతులు అప్రూవల్ తీసుకోకుండా కమర్షియల్ బిల్డింగ్ భారీ ఎత్తున నిర్మాణం చేపట్టినప్పటికీ యర్రగుంట్ల గ్రామపంచాయతీ అధికారులకు చీమకుట్టినట్లయినా లేకపోవడం విడ్డూరమని కాలనీ ప్రజలు తెలియజేశారు. యర్రగుంట్ల గ్రామంలోని బస్టాండ్ ఏరియాలో మద్దిలేటి గారి ఇళ్ళ ఎదురుగా జాతీయ రహదారి సర్వీసు రోడ్డు ప్రక్కన ఉన్నటువంటి అత్యంత శక్తివంతమైన బోరుబావిని నూతన గృహ నిర్మాణం చేపట్టిన వారు కబ్జా చేశారని శిరివెళ్ల



ఎంపీడీవోకు సుమారు 20 మందికి పైగా సంతకాలతో కూడిన వినతి పత్రం ద్వార ఫిర్యాదును అందజేశారు.. నీటి కరువులో సైతం ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఆ బోరు బావి ఆదుకున్నదని. బస్టాండ్ ఏరియాలోని బోరింగ్ వల్ల ప్రయాణికులు వ్యాపారులతో పాటు సమీపంలో ఉన్న మార్తోమా బాలికల హాస్టల్ మరియు సమీప నివాస ప్రజలకు ఎంతగానో నీటి వసతిగా సేవలు అందించేదని సుమారు 500 అడుగులకు పైగా లోతు 60 అడుగులకు పైగా కేసింగ్ 400 అడుగులకు పైగా పైపులు ఉన్నటువంటి బోరుబావిని కబ్జా చేసి ఎటువంటి అనుమతులు లేని ఇంట్లో బోరును కలుపుకొని వాడుకోవడం ఎంతవరకు సబబు అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విలువైన బోరును నూతన కమర్షియల్ బిల్డింగ్ నిర్మాణం చేపట్టిన యర్రగుంట్ల గ్రామ మేదరి వారు కబ్జా చేయడం వల్ల విలువైన బోరు బావి ప్రజలకు దూరం కావడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని అన్నారు. విలువైన బోరు బావిని కబ్జా చేయడం వల్ల గ్రామపంచాయతీకి భారీ గండి కొట్టడమే కాకుండా ప్రజల నోటికాటి దాహాన్ని తీసేశారన్న అపవాదు సైతం మూటగట్టుకున్నారు.
అధికారులు తక్షణమే స్పందించి బోరు బావిని కబ్జా చేసిన యజమానిపై కఠిన చర్యలు తీసుకొని బోరు బావి ప్రదేశంలో స్మాల్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి నీటి ఎద్దడి సమస్య తలేత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని. వై మహేంద్ర మెకానిక్ రవి, శివ పుల్లయ్య, వై మద్దిలేటి, శ్రీనివాస ఆచారి బ్రహ్మయ్య ఆచారి భాష మాధవ కోటేశ్వరప్ప కాజా హుస్సేన్ సుబ్బరాయుడు చిన్న మద్దిలేటి చంద్రయ్య వై మదిలేటి బుర్రెడ్డి పెద్ద మదిలేటి నారాయణ నాగేశ్వరప్ప శ్రీనివాసులు వెంకట శివుడు తదితరులతోపాటు మరో పదిమంది కలిసి లిఖితపూర్వకంగా అర్జీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

# రుతు పవనాలపై..ఎల్ నినో ఎఫెక్ట్..!

## .. నీరు ఎక్కువగా అవసరం లేని ఆరుతడి పంటలు వేసుకోవాలి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 25:**
ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని ఆరుతడి పంటల వైపు మళ్లాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వర్షాధార ప్రాంతాల్లో ఖరీఫ్ సీజన్‌లో ఈ పంటలను ఎంచుకోవడం ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకోవడంతో పాటు మెరుగైన ఆదాయాన్ని పొందే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

**ఎల్ నినో ఎఫెక్ట్.. నీరు ఎక్కువగా అవసరం లేని ఆరుతడి పంటలు ఇవే..**
ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. దీనివల్ల నైరుతి రుతుపవనాలు బలహీనపడతాయి. వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంటోంది.. ఇలాంటి పరిస్థితుల్లో అన్నదాతలు ఆరుతడి పంటల వైపు దృష్టిసారించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు చెబుతున్నారు. వర్షాలు తగ్గడం వల్ల కరవు పరిస్థితులు, వ్యవసాయ రంగానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గి ధరలు పెరిగే అవకాశం ఉందని వివరిస్తున్నారు.. పంటల దిగుబడి భారీగా తగ్గే అవకాశం ఉంటుంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ




సాంకేతిక పరిజ్ఞానం, రైతులలో అవగాహన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.. అలాగే అందుబాటులో ఉన్న వనరులతో పాటు మారుతున్న వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయం చేయలని సూచిస్తున్నారు. ముఖ్యంగా తక్కువ నీటి లభ్యత ఉన్న ప్రాంతాలతోపాటు.. వర్షాలు, ఎక్కువగా నీటిపై ఆధారపడే వారు ఖరీఫ్ లో వర్షాధారంగా లేదా తక్కువ నీటి తడులతో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించడం ఎంతో అవసరం. ఆరుతడి పంటలు వల్ల నష్టాలను నివారించవచ్చని పేర్కొంటున్నారు.

**ఖరీఫ్ సీజన్‌లో అనువైన ప్రధాన ఆరుతడి పంటలు:**

**అపరాలు- పప్పుధాన్యాలు**
కందులు: తేమ తక్కువగా ఉండే ఎర్ర నేలలు, మెట్ట ప్రాంతాలకు ఇవి చాలా అనుకూలం.. నీటిని తక్కువగా ఉపయోగించుకోని సాగు చేసుకోవచ్చు..
పెసర -- మినుము: పెసర, మినుము 75-90 రోజుల్లో చేతికి వచ్చే పంటలు.. వీటికి నీరు కూడా తక్కువ అవసరం ఉంటుంది.

**నూనె గింజలు**
**వేరుశనగ:** వర్షాలు తక్కువగా ఉన్నా తేలికపాటి నేలల్లో బాగా పండుతుంది. వేరుశనగ (పల్లి) పంటకు సాధారణంగా నీరు ఎక్కువగా అవసరం లేదు.




**సోయాబీన్:** నల్లరేగడి నేలలు, తేమ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సాగు చేయడానికి ఇది ఉత్తమమైన ఎంపిక.
**నువ్వులు:** ఖరీఫ్ ప్రారంభంలో (తొలకరి) వేసుకోవడానికి అనువైన నూనె గింజ పంట.

**చిరుధాన్యాలు**
జొన్న, సజ్జలు, రాగి .. నీటి వనరులు తక్కువగా ఉన్నా, వర్షాలు అనిశ్చితంగా ఉన్న ప్రాంతాల్లో ఈ పంటలు సులువుగా పెరుగుతాయి.
మొక్కజొన్న కూడా అద్భుతమైన ఆరుతడి పంట. తక్కువ నీటి లభ్యత ఉన్న పరిస్థితుల్లోనూ, అధిక దిగుబడిని, మంచి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటగా, ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు దీనిని సాగు చేసుకోవచ్చు.
అయితే.. సాధారణంగా ఖరీఫ్ కాలంలో అధిక వర్షపాతం కారణంగా రైతులు ఎక్కువగా వరి సాగు చేస్తారు. ఎల్ నీనో ప్రభావంతో నీటి వనరులు తక్కువగా ఉండే అకాశం ఉండటంతో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ఆరుతడి పంటలు బెస్ట్ అని నిపుణులు చెబుతున్నారు.
ఎల్ నినో సమయంలో ఆరుతడి పంటలు వేయడంతో పాటు.. బిందు సేద్యం లేదా తుంపర సేద్యం పద్ధతులను వాడితే ఉన్న కొద్దిపాటి నీటిని మరింత పొదుపుగా వాడుకోవచ్చు. అలాగే నేలలో తేమ ఆరిపోకుండా మల్చింగ్ పద్ధతిని కూడా ప్రయత్నించవచ్చు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# నాగార్జున కంట్లో పడబోయి

# డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా కంట్లో పడిన ఎస్సై.!

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 25:** తెలుగు బిగ్‌బాస్ సీజన్ 10 సందడి మొదలైంది.. అగ్నిపరీక్ష పేరుతో సామాన్యులకు ఎంట్రీ ఇచ్చేందుకు ఆడిషన్స్ కోసం పిలుపునిచ్చారు. అయితే ఏపీ నుంచి ఓ ఎస్సై తాను బిగ్‌బాస్ షోకు వెళతానంటూ రిక్వెస్ట్ చేశారు. తనకు ఛాన్స్ ఇవ్వాలంటూ ఓ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. సామాన్యులకు అవకాశం కల్పిస్తున్న బిగ్‌బాస్ టీమ్ తనకు అవకాశం కల్పిస్తే నిరూపించుకుంటానని ఎస్సై నాగార్జున కోరారు. బిగ్‌బాస్ షోకు వెళ్లాలని ఉందంటూ ఎస్సై వీడియో తనకు ఛాన్స్ ఇవ్వాలని కోరిన గడివేముల ఎస్సై సోషల్ మీడియా నాగార్జున రెడ్డి వీడియో వైరల్ గడివేముల ఎస్సై నాగార్జున బిగ్‌బాస్(ఫోటోలు- బిగ్‌బాస్ సీజన్ 10 సందడి మొదలైంది.. ఈసారి కూడా అగ్నిపరీక్షకు సిద్ధమయ్యారు. ఈ అగ్నిపరీక్ష ద్వారా సామాన్యులకు కూడా బిగ్‌బాస్‌కు అవకాశం కల్పిస్తున్నారు. బిగ్‌బాస్ హౌస్‌లోకి వెళ్లేందుకు తమకు అవకాశం ఇవ్వాలంటూ తెలుగు రాష్ట్రాల నుంచి రిక్వెస్ట్‌లు మొదలయ్యాయి. ఈసారి బిగ్ బాస్-10లోకి వచ్చేందుకు రెడీ అంటూ ఓ పోలీస్ అధికారి వీడియోను సోషల్ మీడియాలోకి వదిలారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ ఎస్సై నాగార్జున గారు ఒక్క ఛాన్స్ ప్లీజ్ అంటున్నారు.. బిగ్ బాస్ సీజన్ 10లో తనకు అవకాశం ఇవ్వాలని రిక్వెస్ట్ చేస్తున్నారు.బిగ్ బాస్ హౌస్‌లోకి వెళ్లాలని ఉందంటూ నంద్యాల జిల్లా గడివేముల ఎస్సై నాగార్జున రెడ్డి ఓ వీడియో చేశారు. బిగ్‌బాస్‌లోకి సెలబ్రిటీలతో పాటుగా సామాన్యులకు కూడా అవకాశం ఇస్తూ ప్రతిభను వెలికితీస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. బిగ్ బాస్ షోలో ఒక్క అవకాశం ఇస్తే.. తన టాలెంట్ నిరూపించుకుంటానని ఎస్సై నాగార్జున రెడ్డి చెప్పుకొచ్చారు. తాను ఎంతో ఆత్మవిశ్వాసం ఉన్న వ్యక్తినని.. బిగ్‌బాస్‌లోకి అడుగు పెట్టేందుకు అవకాశం కల్పించాలని కోరారు. బిగ్‌బాస్ హౌస్‌లో అడుగుపెట్టడం చాల కష్టమని.. ఒకవేళ వెళ్లినా అక్కడ ఎన్నో కష్టమైన పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఆ టాస్క్‌లు, కష్టాలను ఎదుర్కొని కచ్చితంగా ప్రజల మనసును




గెలుచుకుంటానని చెప్పుకొచ్చారు.

ఎస్సై నాగార్జున రెడ్డి స్వస్థలం కడప జిల్లా కాగా ప్రస్తుతం నంద్యాల జిల్లా గడివేముల ఎస్సైగా పనిచేస్తున్నారు. ఎస్సై పోస్ట్ చేసిన వీడియోపై నెటిజన్లు స్పందిస్తున్నారు. కొంతమంది ఎస్సైకు బిగ్‌బాస్‌లో ఛాన్స్ ఇవ్వాలని కోరుతుంటే.. మరికొందరు పోలీస్ యూనిఫామ్‌లో ఉన్న వ్యక్తి బిగ్‌బాస్ షోకు ఎలా వెళతారని ప్రశ్నిస్తున్నారు. అలాగే ఆయన ఇలా బిగ్‌బాస్‌కు వెళతానంటూ వీడియో చేయడంపైనా విమర్శలు వస్తున్నాయి. ఒకవేళ ఆయనకు బిగ్‌బాస్‌లోకి వెళ్లాలని ఉంటే ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లొచ్చంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఒకవేళ బిగ్‌బాస్‌లోకి ఎస్సై వెళ్లాలంటే చట్ట ప్రకారం సాధ్యమేనా.. ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోవాలా.. ఆయన ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లాలా.. ఇలాంటి ఎన్నో ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. మరి ఈ వీడియోపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారన్నది చూడాలి. మొత్తం మీద ఎస్సై నాగార్జున రెడ్డి బిగ్‌బాస్ హోస్ట్ నాగార్జున కంట్లో పడబోయి.. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా కంట్లో మాత్రం పడ్డారు.

మరోవైపు తెలుగు బిగ్ బాస్ సీజన్ 10 త్వరలోనే ప్రారంభం కానుంది. ఆగస్ట్ లేదా సెప్టెంబర్‌లో షో మొదలయ్యే అవకాశం ఉందంటున్నారు. ప్రస్తుతం బిగ్ బాస్ అగ్నిపరీక్షకి ఆడిషన్స్ నిర్వహిస్తామని ప్రకటించారు. ఆ గడువు కూడా ముగిసింది.. కానీ పెద్దగా స్పందన రాకపోవడంతో రెండో సారి గోల్డెన్ ఛాన్స్ అంటూ బిగ్ బాస్ టీం మరో అవకాశం కల్పించింది.

# పశ్చిమాసియాలో నెలకొంటున్న శాంతి

**ఉద్రిక్తతలు తగ్గడంతో మార్కెట్లో సానుకూల పరిస్థితి**

**72.28 డాలర్లకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర**

**బంగారం ధరలు కూడా భారీగా తగ్గుతున్నట్లు అంచనా**

**న్యూఢిల్లీ,జూన్ 25 ఆంధ్ర ప్రగతి** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడంతో చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలు వేగవంతం అవుతున్నాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో గత కొన్ని రోజులుగా చమురు ధరలు భారీగా దిగొస్తున్నాయి. తాజాగా బ్రెంట్ క్రూడ్ ధర అమెరికా-ఇరాన్ యుద్ధం ముందు స్థితికి పడిపోవడం ఊరటనిస్తోంది. గురువారం ఉదయం బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.28 డాలర్లకు పడిపోయింది. క్రితం సెషన్‌తో పోలిస్తే దీని ధర 4శాతం మేర తగ్గడం గమనార్హం. ఇక, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్



క్రూడాయిల్ ధర 1.69శాతం తగ్గి బ్యారెల్‌కు 69.15 డాలర్లు పలికింది. ఇటీవలి కాలంలో దీని ధర 70 డాలర్ల దిగువకు చేరడం ఇదే తొలిసారి. గడిచిన 24 గంటల్లో హర్మూజ్ జలసంధి మీదుగా కనీసం 2 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా అయినట్లు అమెరికా ఇంధన మంత్రిత్వశాఖ వెల్లడించింది. రాబోయే కొన్ని వారాల్లోనే ఈ జలమార్గంలో చమురు రవాణా యుద్ధం మునుపటి స్థాయికి పెరుగుతుందని అంచనా వేసింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 3996 డాలర్లకు చేరింది. వెండి (ధర 57.35 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. దీంతో హైదరాబాద్ విపణిలో గురువారం ఉదయం 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.1.44లక్షలు పలికింది. కిలో వెండి ధర రూ.2.22లక్షలకు దిగొచ్చింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర 1.41లక్షలు (10 గ్రాములకు), వెండి ఫ్యూచర్ ధర రూ.2.13లక్షలుగా (కిలోకు) ట్రేడ్ అవుతోంది. మరోవైపు, దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కూడా గురువారం లాభాల్లో కొనసాగాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలకు తోడు.. దేశీయంగా బ్యాంకింగ్, స్థిరాస్తి రంగ సూచీల్లో కొనుగోళ్లు సూచీలకు మద్దతుగా నిలిచాయి. దీంతో ఉదయం 10 గంటల సమయంలో సెన్సెక్స్ 511.62 పాయింట్లు పెరిగి 77,502 వద్ద, నిఫ్టీ 150 పాయింట్ల లాభంతో 24,172 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 22 పైసలు పెరిగి 94.33 వద్ద కొనసాగుతోంది.

# గోడౌన్ కూలిన ఘటనలో 8కి చేరిన మృతుల సంఖ్య

**కొనసాగుతున్న సహాయక చర్యలు..సిఎం పర్యవేక్షణ**

**కోల్‌కతా,జూన్ 25 ఆంధ్ర ప్రగతి** :మహానగరంలోని తరతల ప్రాంతంలో గోడౌన్ కుప్పకూలిన సంఘటనలో మరణించిన వారి సంఖ్య 8కి పెరిగింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించామని అధికారులు వివరించారు. మరో18 మంది గోడౌన్ శిథిలాల కింద చిక్కుకున్నారని తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో గోడౌన్‌లో 60 మంది వరకు కార్మికులు ఉన్నారని వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భారత ఆర్మీ, నగర పోలీసులతోపాటు స్థానికుల సహకారంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే.. మంత్రులతో కలిసి సీఎం సువేందు అధికారి ఘటన స్థలానికి చేరుకున్నారు. స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరో వైపు బాధితుల కుటుంబ సభ్యుల కోసం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూం.. 8697981070, 033 22143526, 033 22535185 నెంబర్లు విడుదల చేసింది. బుధవారం సాయంత్రం ఈ గోడౌన్ కూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటన జరిగిన వెంటనే ఐదుగురు కార్మికులు మరణించగా.. 20 మంది తీవ్రంగా గాయపడిన విషయం విదితమే.

# వెనిజువెలాకు మోడీ ఆపన్నహస్తం

**సాయం అందిస్తామని ప్రకటన -సాయం కోసం సిద్ధంగా ఉన్నామన్న ట్రంప్**

**న్యూఢిల్లీ,జూన్ 25 ఆంధ్ర ప్రగతి**



వెనెజువెలాలో సంభవించిన వరుస భూకంపాలతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఇప్పటివరకు 32 మంది ప్రాణాలు కోల్పోగా.. 700 మంది వరకు గాయపడ్డారని తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. రాజధాని నగరం కరాకస్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత ధాటికి భవనాలు కూలిపోవడంతో.. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారు. దాంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ఈ విపత్తు సమయంలో ఆదుకునేందుకు ప్రపంచ దేశాలు ఆపన్నహస్తం సాచాయి. వెనెజువెలా ప్రకృతి విలయంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ఆ దేశానికి అండగా ఉంటామని ఎక్స్ వేదికగా వెల్లడించారు. సహాయసహకారాలు అందిస్తామని ప్రకటించారు. వెనెజువెలా ప్రజలకు సహాయం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా సంసిద్ధంగా ఉండాలని అన్ని ఏజెన్సీలను ఆదేశించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వెనెజువెలా ప్రజలను గొప్ప స్నేహితులుగా అభివర్ణించారు. ఇప్పటికే సహాయక బృందాలను మోహరించామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో వెల్లడించారు.

# ట్రిపుల్ తలాక్ ఉండాల్సిందే

**బహుభార్యత్వం కూడా సమర్థనీయమే**

**మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్‌సిపి ఎమ్మెల్యే సనా మాలిక్ వ్యాఖ్యలు**

**తిప్పికొట్టిన బిజెపి ఎమ్మెల్యేలు..పాక్‌కు వెళ్లాలని హితవు**

**ముంబై,జూన్ 25 ఆంధ్ర ప్రగతి**



మహారాష్ట్ర రాజకీయాల్లో యూనిఫామ్ సివిల్ కోడ్, ట్రిపుల్ తలాక్ అంశాలపై కొత్త వివాదం చెలరేగింది. ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యే సనా మాలిక్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అలాగే ఆమె వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు కూడా వస్తున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యే సానా మాలిక్ చేసిన ప్రకటన కలకలం రేపింది. భారత్ లో ఖురాన్ ఆధారిత చట్టాలను అమలు చేయాలని, ట్రిపుల్ తలాక్‌ను సమర్థించాలని మాలిక్ డిమాండ్ చేశారు. పాకిస్తాన్, ఖురాన్, ముస్లిం వ్యక్తిగత చట్టాలను ఉటంకిస్తూ, భారతదేశంలో ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని ఎన్‌సీపీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పాకిస్తాన్ లాగే, భారత్ కూడా ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని ఆమె తెలిపారు. ట్రిపుల్ తలాక్‌ను సమర్థిస్తూ సనా మాలిక్.. విడాకులలో వివిధ రూపాలు ఉన్నాయి. తలాక్-ఎ-హసన్, తలాక్-ఎ-అహ్సన్, తలాక్-ఎ-బిద్దత్ అనే మూడు రకాల విడాకులు ఉన్నాయి. ట్రిపుల్ తలాక్‌కు సంబంధించి ఆమోదించిన చట్టం, అప్పటికే ఆచరణలో విస్తృతంగా అమలులో లేని ఒక వ్యవస్థపై ఆధారపడి ఉంది. దాని ప్రస్తావన ఎక్కడా లేదు. ఆ తర్వాత బహుభార్యత్వం గురించి మాట్లాడుతూ, బహుభార్యత్వం కేవలం ఒక మతంలోనే కాకుండా, ప్రతి మతంలోనూ ప్రబలంగా ఉంది. ముస్లింలలో బహుభార్యత్వం గురించి బోధిస్తారు. దానిని పాటించాలి. దీని కోసం ఒక చట్టాన్ని రూపొందించాలని అన్నారు. తన వ్యాఖ్యలకు సంబంధించి సనా మాలిక్ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో ఒక వీడియోను పంచుకున్నారు. ట్రిపుల్ తలాక్ చట్టం అమలుపై అసెంబ్లీలో తన అభిప్రాయాన్ని వెల్లడించానని, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అన్ని మతాలకు సమానంగా వర్తించే చట్టాలు ఉండాలని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, ఈ అంశంపై జరిగిన చర్చలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి యోగేష్ కదమ్ స్పందించారని, చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత అవి అన్ని మతాలకు వర్తిస్తాయని ఆయన చెప్పినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఈ వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు సనా మాలిక్ పై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర ప్రభుత్వ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే నితేష్ రాణెళి మాట్లాడుతూ, ట్రిపుల్ తలాక్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ, అసెంబ్లీలోని కొందరు ఖురాన్, ముస్లిం గ్రంథాలను ఉటంకిస్తూ యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ)ని ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నారని అన్నారు. యూసీసీ గురించి రాజ్యాంగంలో ప్రస్తావించారు, కానీ కొందరు తమ చట్టవిరుద్ధ చర్యలను సమర్థించుకోవలసి వచ్చినప్పుడు మాత్రమే దానిని ప్రస్తావిస్తారు. ఎవరైనా దేశ చట్టాలను, రాజ్యాంగాన్ని పాటించకూడదనుకుంటే, వారు తమ పదవికి రాజీనామా చేసి పాకిస్తాన్‌కు వెళ్ళిపోవాలి అని సూచించారు.

# నల్లగొండలో నలుగురి అనుమానాస్పద మృతి కేసు

**పోలీసుల అదుపులో ఆరుగురు సుపారీ హంతకులు ?**



**నల్గొండ,జూన్ 25 ఆంధ్ర ప్రగతి** జిల్లా కేంద్రంలోని తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి అనుమానాస్పద మృతి కేసు కీలక మలుపు తిరిగింది. భార్యాభర్తలు మహ్మద్ సుల్తాన్(45), హసీనా(38), కుమారుడు ముజామిల్(20), కూతురు అఫోర(14)ను నిందితులు విచక్షణారహితంగా హత్య చేసినట్టు పోలీసులు గుర్తించారు. సుపారీ గ్యాంగ్‌లోని ఆరుగురు సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకొని రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్టు సమాచారం. కుటుంబ గొడవలు, ఆస్తి తగాదాలే హత్యలకు కారణంగా భావిస్తున్నారు. ఈనెల 22న హత్యలు జరగ్గా.. ఘటనాస్థలిలో ఏ ఒక్క ఆధారం లభ్యం కాకపోయినప్పటికీ పోలీసులు తీవ్రంగా శ్రమించి .. సుపారీ గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పదునైన ఆయుధంతో దాడిచేసి హత్య చేసినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలిందని పోలీసులు తెలిపారు. నగరంలోని ప్రకాశం బజార్‌లో సుల్తాన్ బ్యాగులు విక్రయించే వ్యాపారం చేస్తున్నారు. దంపతుల మధ్య కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. మద్యం తాగి తరచూ ఇంటికి వచ్చి సుల్తాన్ గొడవ పెట్టుకునేవారని స్థానికులు చెబుతున్నారు. వీరి కుమారుడు ముజామిల్ ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. హసీనా ఓ ప్రైవేటుపాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కుమార్తె అఫోర ఇదే పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. సుల్తాన్ మొదటి భార్య మృతిచెందింది. హసీనాతో రెండో వివాహం కాగా ఇప్పుడున్న పిల్లలిద్దరూ సుల్తాన్ మొదటి భార్య పిల్లలని స్థానికులు చెబుతున్నారు.

# ఈపీఎఫ్ఓ సేవలు 4 రోజులు బంద్!

**జూన్ 26 నుంచి 29 వరకు ఈపీఎఫ్‌వో ఆన్‌లైన్ సేవలు నిలిపివేత**

**జూన్ 30 నుంచి సేవలు పునరుద్ధరణకు అవకాశం**

**న్యూఢిల్లీ,జూన్ 25 ఆంధ్ర ప్రగతి**




దేశవ్యాప్తంగా కోట్లాది ఉద్యోగులు వినియోగించే ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఆన్‌లైన్ సేవలు కొన్ని రోజుల పాటు అందుబాటులో ఉండవు. సిస్టమ్ అప్‌గ్రేడ్, డేటా మైగ్రేషన్ పనుల కారణంగా సభ్యుల పోర్టల్, యజమానుల పోర్టల్, ఉమంగ్ యాప్‌లోని పలు కీలక సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఈపీఎఫ్‌వో ప్రకటించింది.

జూన్ 26 నుంచి 29 వరకు ఈ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ కాలంలో పీఎఫ్ క్లెయిమ్‌లు దాఖలు చేయడం, క్లెయిమ్ ప్రాసెసింగ్, ఈ-పాస్‌బుక్ వీక్షించడం, కొత్త ఉద్యోగుల యూఏఎన్ లింకింగ్, ఈసీఆర్ ఫైలింగ్ వంటి సేవలు అందుబాటులో ఉండవు. సాంకేతిక మార్పుల ద్వారా మరింత వేగవంతమైన, సురక్షితమైన సేవలు అందించడమే దీని ఉద్దేశమని ఈపీఎఫ్‌వో తెలిపింది.సేవలు జూన్ 30 నుంచి తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. అయితే ఉమంగ్ యాప్‌లో కనిపిస్తున్న సమాచారం ప్రకారం కొన్ని సేవలు జులై 2 వరకు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో సభ్యులు, యజమానులు తమ అవసరాలను ముందుగానే పూర్తి చేసుకోవాలని సూచించింది. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఈపీఎఫ్‌వో హెల్ప్‌లైన్ 14470ను సంప్రదించాలని సంస్థ సూచించింది.